క్లుప్తంగా

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.36 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 28 రోజులకు గాను రూ.18.36 లక్షలు, 3 గ్రాముల 320 మిల్లీగ్రాముల బంగారం, 143 గ్రాముల 400 మిల్లీగ్రాముల వెండి, పలు దేశాలకు చెందిన 228 డాలర్లు, 551 ఖతార్ రియాన్స్, 3 మలేషియా రింగిట్స్ వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్. చోళన్, శివజ్యోతి, శ్రీవేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్. ప్రసాద్, భక్తులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థిని అదృశ్యం



ఆశాజ్యోతి

మద్రిపాలెం: ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆశాజ్యోతి అనే బాలిక తల్లిదండ్రులు గతంలో మరణించారు. అప్పటి నుంచి బాలిక అమ్మమ్మతో కలిసి మురళీనగర్ వర్మా కాంప్లెక్ సమీపంలో నివసిస్తోంది. ఇంటికి సమీపంలో ఉన్న బాలభాను స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం స్కూల్‌కు దగ్గరలోని ఓ హోటల్‌లో స్నేహితులను తీసుకుని లంచ్‌కు వెళ్లింది. అక్కడ భోజనం తినేసి ఆశాజ్యోతి ఆటో ఎక్కి వెళ్లిపోయినట్టు స్నేహితుల తల్లి ఒకరు బాలిక అమ్మమ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అమ్మమ్మ తాడి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక చామనఛాయ రంగుతో 5.2 అంగుళాల ఎత్తు కలిగి ఉంది. ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆశాజ్యోతి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

పోక్సో కేసు నమోదు

సీతమ్మధార: బాలికను గర్భవతిని చేసిన ఘటనలో ఓ బాలుడిపై ఫోర్త్‌టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలిలా.. రైల్వే న్యూకాలనీకి చెందిన 17 ఏళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన బాలుడు పదో తరగతి చదివేటప్పటి పరిచయంతో ఈ ఏడాది మార్చిలో తన ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక గర్భవతి కావడంతో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో స్వల్ప మార్పు



తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో ప్రతీ రోజు బయల్దేరే విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ వేళలు పలాసలో స్వల్పంగా మారినట్లు వాల్తేర్ డివిజన్‌అధికారులు తెలిపారు. ఈ రైలు ఆగస్టు 15 నుంచి పలాస స్టేషన్‌కు రాత్రి 6.43 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.48 గంటలకుబయల్దేరుతుంది.

స్నేహమేరా జీవితం


మిత్ర బృందంతో మేడపాటి రమేష్‌రెడ్డి

సీతమ్మధార: స్నేహానికన్న మిన్న లోకాన లేదురా.. స్నేహం గురించి గొప్పగా ఇంతకంటే ఎలా చెప్పగలం. కాలం మారుతున్నా.. స్నేహం మారదనడానికి ఎన్నో స్నేహగీతాలే నిదర్శనం. స్నేహ బంధం ఎంతో గొప్పది. దీనికి కుల, మత, వర్ణ, వర్గ బేధాలు లేవు. ఈ లక్షణమే అందిరినీ స్నేహితులుగా కలుపుతుంది. ఫ్రెండ్‌షిప్ డే రోజున స్నేహితులు చేసే సందడి అంతా ఇంతా కాదు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా గ్రాండ్‌గా వేడుకలు జరుపుకునేందుకు మిత్రులు అందరూ సిద్ధమయ్యారు.


మార్కెట్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు

ఏడో తరగతి నుంచే స్నేహం

వారంతా ఏడో తరగతి నుంచే మంచి స్నేహితులు. ప్రతి ఏటా స్నేహితుల దినోత్సవం రోజున అందరూ కలిసి సరదాగా గడుపుతారు. పాత జ్ఞాపకాలను నెమర వేసుకుంటారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. స్వాతి ప్రమోటర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మేడపాటి రమేష్‌రెడ్డి మిత్ర బృందం కథే ఇది. వీరంతా ప్రస్తుతం విశాఖపట్నంలో వివిధ రంగాల్లో స్థిరపడి జీవిస్తున్నారు. నెలకు రెండు మూడు సార్లు కలుసుకుని సందడి చేస్తారు. ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా జరుపుకుంటామని రమేష్‌రెడ్డి బృంద మిత్రులంతా చెబుతున్నారు.



సందడిగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ల దుకాణాలు

స్నేహితుల దినోత్సవం సందర్భంగా సీతమ్మధారలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ల దుకాణాలు సందడిగా కనిపించాయి. యువతీ, యువకులు, విద్యార్థులు తమ స్నేహితుల కోసం వివిధ రకాల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో వివిధ రకాల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు జోరుగా విక్రయించారు. షాపులు, స్టాళ్ల వద్ద అమర్చిన విద్యుద్దీప కాంతుల్లో రంగురంగుల బ్యాండ్లు మెరుస్తూ దారిన పోయే వారిని ఆకర్షించాయి.

తుపాకీతో మానవాళి మనుగడకు ముప్పు


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, ప్రకాశరావు తదితరులు

సీతంపేట: తుపాకీ సంస్కృతి మానవ మనుగడకు వినాసనకారి అవుతోందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో శనివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో తుపాకీ సంస్కృతి అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి, ఆచార్య పద్దయ్య, డాక్టర్ కె.వి.ఎస్.ఎం.మూర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికాలో తుపాకీ సంస్కృతి పెరుగుతూ ఉందని, ఇది మానవాల మనుగడకు ముప్పు అవుతోందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇటీవల ట్రంప్‌పై జరిగిన తుపాకీ కాల్పులను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అమెరికాలో గన్ కలిగి ఉండటం హక్కు అని, అది చట్ట పరిధిలో, నియంత్రణలో ఉండాలని కోరారు. రక్షణతో కూడిన సంస్కృతిని అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. మన దేశంలో కూడా తుపాకీకి బలై అనేక మంది నాయకులను కోల్పోయామని గుర్తుచేశారు. మనిషి ఆలోచనల్లో మార్పు రావాలని, అందుకు విద్యా వ్యవస్థలో పెనుమార్పులు రావాలని సూచించారు. అనంతరం శాంతిని కోరుతూ వక్తలంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రమ, మహమ్మద్ మున్నార్, బి.చిన్నారావు, చాట్ల బాబూరావు, రెడ్డి జోగారావు పాల్గొన్నారు.

మరణానంతరం మళ్లీ జీవనం

- కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద
- అవయవదానంపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద తదితరులు

సీతంపేట: అవయవదానం ద్వారా మరణించిన తర్వాత కూడా జీవించవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా అఖిల భారత అవయవ దాతల సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరణం తర్వాత కూడా జీవించాలంటే ప్రతి ఒక్కరూ అవయవదానం చెయ్యాలని కోరారు. ఏఎంసీ అనాటమి విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్ మాట్లాడుతూ అవగాహన కోసమే ప్రభుత్వం అవయవ దాన దినోత్సవం జరుపుతుందన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ శరీరం వృథాకాకుండా, మానవతా దృక్పథంతో అవయవదానం చేయాలని కోరారు. రక్తదాన ఉద్యమకర్త పి.వినోద్‌బాలు మాట్లాడుతూ రక్తదానం, అవయవదానం వెనుక నిజమైన దైవత్వం ఉందన్నారు. అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మరణించినా జీవించండి అంటూ స్టిక్కర్స్ ద్వారా ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. అన్ని పీహెచ్‌సీలలో కూడా ప్రచారం చేస్తున్నామని, జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో అవయవదానం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మూఢనమ్మకాలు వదిలి అవయవదానం కోసం ముందుకు రావాలన్నారు. సీఐఎస్ఎఫ్ అధికారి డాక్టర్ ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానం కోసం 20 ఏళ్లుగా సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫణి, ఏఎంసీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్, సంస్థ కార్యదర్శి ఎస్.బాబూరావు, సంస్థ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు

వేగవంతంగా ‘ప్రసాద్’ పథకం పనులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కొండదిగువ పుష్కరిణీసత్రం, కల్యాణమండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో టూరిజంశాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ల ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఏపీ డబ్ల్యుజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ రూ. 1250 మెడీ క్లెయిమ్ చెల్లించాలని, జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరోతి ఈశ్వరరావు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

80 ఫీట్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు


80 ఫీట్ రోడ్డులో నిలిపిన వాహనాలను తరలిస్తున్న ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ సిబ్బంది


రోడ్డుపై వేసిన పిక్కను ఖాళీ చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం - మహారాణి పార్లర్ 80 అడుగుల రహదారిలో ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టారు. అనధికార పార్కింగ్, భవన నిర్మాణ సామగ్రి, ఇతర వ్యాపారాల నిర్వహణతో 80 ఫీట్ రోడ్డు కుచించుకుపోయింది. ఈ సమస్యపై శుక్రవారం ‘రోడ్డంతా ఆక్రమణలే..!’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు ఆధ్వర్యంలో శనివారం ఈ ప్రాంతంలోని ఆక్రమణలను ఖాళీ చేయించారు. ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ సిబ్బంది దగ్గరుండి ఈ రహదారిలో ఎంతోకాలంగా నిలిపివేసిన వాహనాలను అక్కడ నుంచి వేరే చోటకు తరలించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లపై వేసిన భవన నిర్మాణ సామగ్రిని తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో 80 అడుగుల రహదారి మళ్లీ విశాలంగా మారింది. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న బాధితుడు రాజశేఖర్, గ్రామ పెద్దలు

సీతమ్మధార: తన ఇంటి పక్కనే ఉంటున్న వ్యక్తి తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 24వ వార్డు నక్కవానిపాలెంలోని 15-2-18/2 నంబర్ ఇంట్లో నివసిస్తున్న నక్క రాజశేఖర్‌రెడ్డి దంపతులు తమకు న్యాయం చేసి, రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం గ్రామ పెద్దలతో కలిసి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఇంటి పక్కనే ఉంటున్న అన్నాచెల్లెళ్లు భీశెట్టి కుమార్ బాబు, భీశెట్టి మాధవి కొన్నేళ్లుగా తమతో గొడవలు పడుతున్నారన్నారు. ముఖ్యంగా కుమార్‌బాబు తన కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడని వాపోయాడు. దీనిపై గతంలో మూడు సార్లు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. కుమార్ బాబు తీరు మారలేదన్నాడు. ప్రస్తుతం కుమార్ బాబు కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడని, ఈక్రమంలో మా ఇళ్ల మధ్య ఉన్న సరిహద్దు గోడను గురువారం ఎవ్వరికీ తెలియకుండా అతడు కూల్చేశాడన్నారు. దీనిపై తాను, తన సోదరి సులోచన కుటుంబ సభ్యులు నిలదీయగా.. తిరగబడి కొట్టేందుకు ప్రయత్నించాడని చెప్పారు. వెంటనే ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసి పరిస్థితిని విన్నవించి న్యాయం చేయాలని కోరినట్లు రాజశేఖర్ తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐకు ఫోన్ చేసి కుమార్‌బాబుపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ అధ్యక్షుడు కాటరాజురెడ్డి, డి.వి.ఎస్. ప్రసాద్‌రెడ్డి, బర్ల బాలకృష్ణ, నక్క కన్నారావురెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ వార్డు అధ్యక్షుడు శంకర్, ధర్మాల గురుమూర్తిరెడ్డి, సుజాత, ఎరుసు సులోచన, గుజ్జు వేణుగోపాలరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించుకుంటేనే విశాఖ మనుగడ


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార: కార్పొరేట్ శక్తుల నుంచి విశాఖ జిల్లా ప్రజలను, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ఉద్యమాలకు ఇక్కడి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కొత్తపల్లి లోకనాథం పిలుపునిచ్చారు. భీమిలి ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలకు, కుసులువాడ మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా చేపట్టారు. దీనికి సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని గత ఇరవై ఏళ్లుగా పాలకులు చెబుతున్నా వాస్తవానికి అభివృద్ధి ముసుగులో కార్పొరేట్ శక్తులతో మైనింగ్, భూదందా వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. విశాఖ బీచ్ సీఆర్‌జెడ్ జోన్‌లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఆనందపురం, కుసులువాడ ప్రాంతాల్లో గ్రావెల్, మైనింగ్ వంటి వాటికి కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ, ఆటవీ రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతులివ్వడాన్ని తప్పు పట్టారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వాల్లాగే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజా తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, ఆర్ఎస్ఎన్ మూర్తి, బి.రమణి, నరేంద్రకుమార్, సుబ్బారావు, పి.మణి, రాజు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 19.7 కిలోల గంజాయి పట్టివేత


రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ సిబ్బందితో రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై తనిఖీలు చేశారు. పాండిచ్చేరికి చెందిన జయన్‌సొసాయ రాజా, ఎస్.అరుణ్ అనే యువకులు అక్రమంగా గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.98,500 విలువైన 19.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించగా.. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఫ్లైఓవర్‌పై డీసీఎం వ్యాన్ బోల్తా


ఫ్లైఓవర్‌పై బోల్తా పడిన వ్యాన్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై లామినేషన్ షీట్లు తీసుకెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్టు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి గురుద్వార్ వద్ద లామినేషన్ షీట్లు లోడింగ్ చేసుకున్న సిబ్బంది ఉదయం బెంగళూరు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై రోటరీలో వెళ్తున్న సమయంలో లోడ్ చేసిన లామినేషన్ షీట్లు ఒక్కసారిగా ఎడమ వైపునకు దొర్లడంతో వ్యాన్ ఒరిగిపోయి ఫ్లైఓవర్ రెయిలింగ్ వాల్‌ను ఆనుకుని నిలిచిపోయింది. ఇది గమనించి ట్రాఫిక్ ఎస్ఐ బాలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వ్యాన్‌లో ఉన్న లామినేషన్ షీట్లను తొలగించి మరో వ్యాన్‌లో తరలించారు. క్రేన్ సాయంతో బోల్తా పడిన వ్యాన్‌ను పక్కకి తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కొండలరావుకు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ వ్యాన్‌పై టార్పా చుట్టి ఉండడంతో ఈ షీట్లు బ్రిడ్జ్ దిగువకు పడకుండా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం వేకువ జామున జరగడం వల్ల జన సంచారం, వాహనాల రద్దీ లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని అంతా చెబుతున్నారు. డ్రైవర్ ఎయిర్‌పోర్టు పోలీసులఅదుపులో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకల పేరుతో అరాచకం



సంబరాలు సంతోషాన్ని పంచాలి. వేడుకలు జ్ఞాపకాలను మిగల్చాలి.. అంతేగాని విషాదమైతే.. భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. బుల్లయ్య కాలేజ్, టెక్ మహీంద్రా ఐటీ సంస్థ మధ్య రోడ్డులో విద్యార్థులు పెచ్చుమీరుతున్నారు. ప్రతి రోజు పుట్టినరోజు, ప్రత్యేక రోజుల్లో వేడుకల పేరుతో విపరీత బుద్ధి ప్రదర్శిస్తున్నారు. కేక్ కటింగ్‌ల నుంచి మద్యపానం వరకు అన్నీ ఆ రోడ్డులోనే చేస్తున్నారు. అర్ధనగ్నంగా చెలరేగుతూ పెచ్చుమీరుతున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా శనివారం ఆ రోడ్డులో కొంత మంది విద్యార్థులు అగ్నితో ఆటలాడుతూ అటుగా వెళ్లే వారిని భయాందోళనలకు గురి చేశారు. కేక్ కట్‌చేసి ఫైర్ స్ప్రేతో చిందులు తొక్కారు. నిత్యం ఇక్కడ అదే పరిస్థితి కనిపిస్తున్నా.. కాలేజీ యాజమన్యం గానీ, పోలీసులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నేడు కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: జూనియర్ కాలేజీల్లో ఆదివారం తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

సిరులతల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మీ పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆగస్టు 16న వరలక్ష్మీ వ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. శ్రావణంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో(ఆగస్టు 9, 16, 23, 30) విశేష పూజలు చేస్తామన్నారు.

రేపటి నుంచి ప్రారంభం

ఈ నెల 5వ తేదీ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభమవుతాయని ఈవో తెలిపారు. నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి 9 వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలని కోరారు.